క్లుప్తంగా

క్షయపై అప్రమత్తం



మచిలీపట్నంటౌన్: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంటీటీపీ వైద్యుడు ఎం.వేణుగోపాల్ అన్నారు. క్షయపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడానికి సోమవారం స్థానిక లేడీయాంప్తిల్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణకు 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులు, 60 ఏళ్ల దాటిన వారికి ధూమపానం, మద్యపానం అలవాటు ఉన్నవారికి క్షయ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వారికి కళ్లె పరీక్షలు, ఎక్స్‌రేలు తీసి వ్యాధి నిర్ధారణ చేస్తామన్నారు. వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయితే మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో లేడీ యాంప్తిల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, టీబీ విభాగ సిబ్బంది కేవీవీ ప్రసాద్‌బాబు, సుధాకర్, మధుసూదనరావు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ప్రవాహం



నాగాయలంక: కృష్ణానదికి ఎగువన ప్రకాశం బ్యారేజీ వద్ద 53875 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయడంతో నాగాయలంక శ్రీరామ పాద క్షేత్రం పుష్కరఘాట్‌లో కృష్ణానది వరద ప్రవాహం పెరిగింది. వడివడిగా బంగాళాఖాతం వైపు దూసుకుపోతున్న వరద ప్రవాహానికి సముద్రపు పోటు తోడవడంతో ఘాట్‌లోని కృష్ణవేణి మాత విగ్రహం, రామలింగేశ్వరుడి మండపం దాటుకుని ముందుకు దూసుకొచ్చింది. మండలంలోని కృష్ణా పరీవాహక లంక ప్రాంతాల్లో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సీహెచ్‌వి ఆంజనేయప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

నేడు మాజేరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చల్లపల్లి: మండలంలోని మాజేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకూ మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బసవశాస్త్రులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ ఎక్స్‌టెన్షన్ పనులు నిర్వహిస్తున్న కారణంగా సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు.

గూడూరు: మండల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ చేయనుండటంతో మంగళవారం పలు గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ మచిలీపట్నం ఈఈ జి.గోవిందరావు తెలిపారు. గూడూరు, చిట్టిగూడూరు, తుమ్మలపాలెం, ఆకుమర్రు,రామరాజుపాలెం, కోకనారాయణపాలెం గ్రామాల్లో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వెల్లడించారు.

కేడీసీసీ చల్లపల్లి బ్రాంచ్ కొత్త భవనం ప్రారంభం



చల్లపల్లి: కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రైతులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కొత్తగా నిర్మించిన బ్యాంక్ చల్లపల్లి బ్రాంచ్‌ని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో ఆప్కాబ్ జీఎం పి.మణి, ఎంపీపీ కోట విజయరాధిక తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సొంత భవనానికి శంకుస్థాపన

బ్యాంకు చల్లపల్లి బ్రాంచిని 1975లో ఏర్పాటు చేశారు. ఈ బ్రాంచికి 2023 వరకూ సొంత భవనం లేదు. దీంతో నాటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చొరవతో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేడీసీసీ బ్యాంకు చల్లపల్లి బ్రాంచ్ సొంత భవనాన్ని నిర్మించేందుకు అనుమతించారు. భవన నిర్మాణానికి రూ.1.61కోట్లు మంజూరు చేశారు. వెంటనే పనులు ప్రారంభించారు. ఆ భవనాన్ని నేడు కూటమి నాయకులు ప్రారంభించారు.

నేడు ఫైబర్ బోట్ల పంపిణీ

నాగాయలంక: ప్రజా ప్రగతి సేవా సంఘం ఆధ్వర్యాన నాగాయలంక మండలంలోని మర్రిపాలెం, కమ్మనమోలు, సంగమేశ్వరం గ్రామాలకు చెందిన 25 ఎస్టీ (యానాదులు) కుటుంబాలకు నాబార్డు (ట్రైబల్ డెవలప్‌మెంట్ ఫండ్స్) సాయంతో మంగళవారం ఫైబర్ బోట్లు పంపిణీ చేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కో ఆర్డినేటర్ నక్కా విజయబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్‌లోని పర్యాటక శాఖ ఫుడ్‌కోర్ట్ భవనంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

యూరియా కోసం అగచాట్లు

గూడూరు: యూరియా కోసం రైతులకు అగచాట్లు తప్పడం లేదు. రెండు రోజుల క్రితం మల్లవోలుకు ఒక లారీ లోడు యూరియా రావడంతో రైతులు తోపులాటకు దిగారు. సోమవారం మండల పరిధిలోని కంకటావ, ఆకులమన్నాడు గ్రామల్లో అదే పరిస్థితి పునరావృతమైంది. ఆయా గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు సోమవారం యూరియా లోడు వచ్చింది. ఒక్కో సంఘానికి 450 కట్టల యూరియా మాత్రమే రావడంతో రైతులు ఎగబడ్డారు. కొందరు బడా రైతులు పలుకుబడి చూపించుకుని యూరియా దక్కించుకుంటుంటే చిన్నకారు రైతుల్లో ఆందోళన మొదలైంది. దీంతో ఆయా సంఘాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. రైతుల తోపులాటల మధ్య అమ్మకాలు పూర్తి చేసి సంఘాల ప్రతినిధులు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు.

బారులు తీరిన రైతులు

మోపిదేవి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్)కు సోమవారం యూరియా వచ్చిందని తెలిసిన వెంటనే పెద్ద సంఖ్యలో రైతులు బారులు తీరారు. కొంతకాలంగా యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మోపిదేవి పీఏసీఎస్‌కు 400 యూరియా కట్టలు వచ్చాయి. యూరియా కట్టలు గంటల వ్యవధిలోనే అమ్ముడుపోయాయి. ప్రభుత్వం స్పందించి యూరియా కొరత లేకుండా రైతులకు సకాలంలో అందించాలని కోరుతున్నారు.

అరకట్ట యూరియాతో సరి

కృత్తివెన్ను: అడిగిన వారికి అరకట్ట యూరియాతోనే సరిపుచ్చుకోవాల్సిన దుస్థితి రైతులకు వచ్చింది. సోమవారం కృత్తివెన్ను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి 20 టన్నుల యూరియా లోడ్ వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో సొసైటీ వద్దకు చేరుకున్నారు. తీరా చూస్తే ఇంతకు ముందు నమోదు చేసుకున్న వారికి ఇవ్వాల్సి ఉంది వారికి ఇచ్చిన తర్వాత మిగిలితే కొత్తవారికి ఇస్తామంటూ సొసైటీ అధికారులు కండిషన్ పెట్టారు. దీంతో రైతులు కనీసం తమకు ఒక కట్ట అయినా ఇవ్వాలంటూ మొరపెట్టుకున్నారు. దీంతో చేసేది లేక కట్ట అడిగిన వారికి అరకట్టతో సరిపుచ్చాల్సి వచ్చింది. గతంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రతి గ్రామంలో అడిగిన వారికి లేదనకుండా యూరియా దొరికేది.. ఇప్పుడేమో కట్ట అడిగితే అరకట్ట ఇస్తున్నారంటూ రైతులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. కృత్తివెన్ను మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో దాదాపు 7200 ఎకరాలలో రైతులు వరిని సాగు చేస్తున్నారు.



మోపిదేవి సొసైటీ వద్ద యూరియా కోసం లైన్‌లో రైతులు



ఘంటసాల పీఏసీఏస్ వద్ద యూరియా కోసం గుమికూడిన రైతులు

బంటుమిల్లి: మండంలో సార్వా సాగు పనులు ఊపందుకోవడంతో యూరియ చల్లేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. దీంతో యూరియ కొరత వెన్నాడుతోంది. సొసైటీలకు యూరియా వచ్చిందని తెలిస్తే చాలు ధృవపత్రాలు తీసుకుని సొసైటీల వద్ద పడిగాపులు పడుతున్నారు. అలాంటిదే సోమవారం బంటుమిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) వద్ద చోటు చేసుకుంది. బంటుమిల్లి పీఏసీఎస్ పరిధిలో దాదాపు 17 గ్రామ పంచాయతీలలోని వేలాది ఎకరాల సాగు భూములున్నాయి. ఈ క్రమంలో ఉదయం సుమారు 20 టన్నుల యూరియా సొసైటీకి వచ్చినట్లు రైతులకు సమాచారం అందింది. దీంతో రైతులు ధృవపత్రాలతో సొసైటీ వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. దీంతో సాయంత్రం 4 గంటలకు యూరియ అమ్మకాలు చేపడతామని సొసైటీ కార్యదర్శి భాస్కరరావు రైతులకు చెప్పాడు. యూరియ అమ్మకాలు మొదలు పెట్టగానే రైతుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వచ్చి రైతులకు సర్దిచెప్పి లైనులో ఉంచి స్లిప్పులు రాయించారు. తర్వాత కట్టలు అమ్మకం ప్రారంభించారు. పీఏసీఎస్ కార్యదర్శి భాస్కరరావు మాట్లాడుతూ ఎకరానికి అర కట్ట చొప్పున అత్యధికంగా రెండు కట్టలు ఇస్తున్నామన్నారు. సొసైటీలో నిల్వ ఉన్నంత వరకు అందజేస్తామని ఆయన చెప్పారు. రైతులకు కావలసిన యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు సంఘం పెడన డివిజన్ కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు ఆరోపించారు.



కంకటావ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఎదుట ఎరువుల కోసం ఎగబడుతున్న రైతులు

ఘంటసాల: యూరియా కోసం రైతులు నానా అవస్థ పడుతున్నారు. ఘంటసాల మండలంలో ఘంటసాల, కొత్తపల్లి, కొడాలి, శ్రీకాకుళం, లంకపల్లి గ్రామాల్లోని పీఏసీఏస్‌లు ఉండగా సోమవారం ఘంటసాల, కొత్తపల్లి పీఏసీఏస్‌ల్లోనే యూరియా అందుబాటులో ఉండటంతో పరిసర ప్రాంతాల రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఘంటసాల పీఏసీఏస్‌కు సుమారు 20 మెట్రిక్ టన్నులు రాగా ఘంటసాల, చిలకలపూడి, వి.రుద్రవరం, దేవరకోట, మల్లంపల్లి, బోల్లపాడు గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఎకరాకు 25 కేజీల చొప్పున పంపిణీ చేసినట్లు కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. అలాగే కొత్తపల్లి పీఏసీఏస్‌కు 20 మెట్రిక్ టన్నులు యూరియా రాగా ఘంటసాలపాలెం, కొత్తపల్లి, తాడేపల్లి గ్రామాల రైతులు యూరియా కోసం క్యూ కట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 189 మంది రైతులకు యూరియా పంపిణీ చేశామని కార్యదర్శి పి.ఆదిలక్ష్మి తెలిపారు.

ఎకరాకు 25 కేజీలు మాత్రమే..

ఒక్కో రైతుకు ఎకరాకు 25 కేజీలు మించి ఇవ్వరాదని, ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నా ఒక్కో రైతుకు గరిష్టంగా నాలుగు కట్టలు మాత్రమే ఇవ్వాలని అధికారులు నిబంధనలు పెట్టారంటే యూరియా కొరత ఏవిధంగా ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. యూరియా తీసుకోవడానికి వచ్చే రైతుల నుంచి ఆధార్, ఫోన్ నంబర్ నోట్ చేసుకోవడంతో పాటు పాస్ పుస్తకం తీసుకోవాలని నిబంధన పీఏసీఏస్ ల వద్ద నోటీసులు అంటించడం గమనార్హం.

కూటమి పాలనలో ప్రజాసంక్షేమం గాలికి..

పెడనలో జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీలో ఉప్పాల రాము

పెడన: ప్రస్తుత ఎన్డీఏ కూటమి పాలనలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. చంద్రబాబు ష్యూరిటీ అని పేర్కొంటూనే గ్యారెంటీగా ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు. సోమవారం రాత్రి పెనుమల్లి విజయకృష్ణ ఫంక్షన్ హాలులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై పెడన మండల స్థాయి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో టీడీపీ ఎటువంటి ఆందోళనలు కూడా చేయలేదని, జగన్ ప్రజారంజక పాలన అందించారని గుర్తు చేశారు. కానీ నేడు అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజాసంక్షేమానికి తూట్లు పొడుస్తూ పథకాలను అమలు చేయకుండా అప్పులు చేస్తూ పరిపాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. అమ్మ ఒడి పథకాన్ని కాపీకొట్టి తల్లికి వందనం కనిపెట్టి అమలు చేస్తున్నట్లు సిగ్గు, ఎగ్గు లేకుండా ప్రకటనలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో సాగు డబ్బులతో రైతుకు భరోసా ఇచ్చారన్నారు. కానీ ఎనీఏ కూటమి ప్రభుత్వం రూ.20వేలు ఇస్తామని ప్రకటించి ఏడాది పాటు రైతులకు ఏమీ ఇవ్వకుండా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంతో కలిపి మూడు విడతలుగా ఇస్తామని చెప్పి ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ఐదేళ్లో రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం పీఏసీఎస్‌లలో రుణాలు తీసుకున్న వారికే యూరియా ఇస్తామంటుంటే తీసుకోని వారి పరిస్థితి ఏంటన్నారు. రైతులకు యూరియా అందడం లేదని ఇదే పరిస్థితి నెలకొంటే రైతుల పక్షాన ఉద్యమం చేస్తామని, రెండు మూడు రోజుల్లో కార్యాచరణ రూపొందించి కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం, ధర్నాలు చేద్దామని పిలుపునిచ్చారు.



ఎన్డీఏ కూటమి మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ వాల్‌పోస్టర్‌ను చూపిస్తున్న రాము తదితరులు

కార్యకర్తలతో ప్రజాసంక్షేమానికి పెద్ద పీట

మనకు మంచి రోజులు రానున్నాయని, అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తల ద్వారానే ప్రజాసంక్షేమానికి పెద్ద పీట వేస్తామని, ఈ విషయాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారని రాము చెప్పారు. కేసులకు భయపడొద్దని పార్టీ అండగా ఉంటుందని, స్థానికంగా నేను మీకు అండగా నిలబడతానని తెలిపారు. గ్రామ స్థాయిలో కమిటీలను మీరే ఎన్నుకోవాలని సూచించారు. గత 20 సంవత్సరాల్లో యూరియా కోసం రోడ్డెక్కలేదని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తాతా ఉమామహేశ్వరరావు చెప్పారు. కూటమి పాలనలో ఇప్పుడు యూరియా కోసం నరకయాతన పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో నేతలు తిరుమాని శ్రీనివాసరావు, వేముల సురేష్‌రంగబాబు, ముత్యాల నాగేశ్వరరావు, ఎంపీపీ రాజులపాటి వాణి, వెంకటేశ్వరమ్మ, అచ్యుతరావు, రామానాయుడు, భైరవలింగం, కొండవీటి నాగబాబు, యాదంరెడ్డి వరప్రసాద్, బొడ్డుగురునాథం, జన్ను నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

నేడు గూడూరులో బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ

గూడూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరించడానికి మంగళవారం గూడూరులో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్ తెలిపారు. పార్టీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆధ్వర్యాన గూడూరు పీఏసీఎస్ ఆవరణలోని రైతు కమ్యూనిటీ హాలులో మంగళవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తపాలా బీమా పేదలకు ఉపయుక్తం

మచిలీపట్నంటౌన్: తపాలా బీమా పేదలకు ఉపయుక్తంగా ఉంటుందని మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బాణావత్ శ్రీనివాసరావు చెప్పారు. తపాలా జీవిత బీమా పథకంలో పొదుపు చేసి అకాల మరణం చెందిన ఇద్దరు మృతుల కుటుంబ సభ్యులకు సోమవారం బీమా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొవ్వ మండలం అయ్యంకి గ్రామానికి చెందిన రాజులపాటి రాంబాబు తపాలా జీవిత బీమా పాలసీ తీసుకున్నాడన్నారు. రెండేళ్ల పాటు రూ. 80 వేలే కట్టాడన్నారు. రాంబాబు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆయన భార్య నాగమణికి రూ.4,80,759 మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేస్తున్నట్లు చెప్పారు. మీర్జా అసద్ అబ్బాస్ రూ. 2 లక్షల పాలసీ తీసుకుని 9 నెలలే పాలసీ సొమ్ము కట్టాడన్నారు. ఆయన అనారోగ్యంతో మృతి చెందడంతో బీమా పథకం ద్వారా ఆయన నామినీ జహాన్‌కి రూ. 3,33,200 మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశామన్నారు. చెక్కుల పంపిణీలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ జె.నాగరాజు, పోస్ట్ మాస్టర్ జి.అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బీమా సొమ్ము చెక్కులను అందజేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

విద్యార్థులు ప్రాణదాతలు కావాలి

మచిలీపట్నంఅర్బన్: విద్యార్థులు రక్తదాతలుగా ముందుకొచ్చి ప్రాణదాతలు కావాలని జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ పీబీ సాల్మన్ రాజు తెలిపారు. స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యాన జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రక్తదాతగా మారాలన్నారు. కోవిడ్ అనంతరం హెచ్ఐవీ కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. వాటిని తగ్గించాలంటే ప్రజల్లో ప్రధానంగా విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించాలన్నారు. ప్రిన్సిపాల్ పి. లక్ష్మి మాట్లాడుతూ రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేస్తామన్నారు. క్విజ్ పోటీల్లో రుద్రపాక ప్రభుత్వ కళాశాల మొదటి స్థానం, ఆకునూరు ప్రభుత్వ కళాశాల రెండు, అవనిగడ్డ ప్రభుత్వ కళాశాల మూడో స్థానం పొందాయి. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరినాథ్‌బాబు, జిల్లా న్యూక్లియర్ మెడికల్ అధికారి వేణుగోపాల్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎల్. మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ పీబీ సాల్మన్‌రాజు

పంట కాలువలు, పొలాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

అవనిగడ్డ: పంటకాలువలు, పొలాలను ఇరిగేషన్ అధికారులు పరిశీలిస్తున్నారు. సాగునీరు అందక పోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులు వివరిస్తూ ఇటీవల 'సాక్షి' కథనాలు ప్రచురించింది. వీటికి స్పందించిన ఇరిగేషన్ డీఈ బి.గణపతి మూడు రోజుల నుంచి మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక మండలాల్లో పర్యటించి పంటకాలువలు, నారుమళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సోమవారం కోడూరు మండలంలోని సాలెంపాలెం, పిట్టల్లంకలో పర్యటించి పంట కాలువలను పరిశీలించారు. పలుచోట్ల నారుమళ్లను పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడి సాగునీటి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ వర్షాలు పడక పూర్తిగా పంటకాలువలపై ఆధారపడి సాగుచేయడంతో కొన్నిచోట్ల ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. నాట్లు వేసిన ప్రాంతాల్లో కొంతమేర సాగునీటి సరఫరాని తగ్గించి నాట్లు వేయని ప్రాంతాలకు సరఫరా పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు సాగునీటిని వృథా చేయొద్దని, రానున్న నాలుగైదు రోజుల్లో వర్షాలు పడతాయని వాతావరణశాఖాధికారులు సూచించారని తెలిపారు. కార్యక్రమంలో కోడూరు ఏఈ , ఏఈ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పిట్టల్లంకలో రైతులతో మాట్లాడుతున్న డీఈ గణపతి

సబ్‌ట్రెజరీ కార్యాలయానికి బీరువా బహూకరణ

అవనిగడ్డ: స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయానికి ఏపీ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు బీరువాను బహూకరించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి రామకృష్ణ, అబ్దుల్ అజీజ్ ఎస్టీవో అనీష్ అహ్మద్‌కు బీరువాని అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నరసింహారావు, బాలకృష్ణశాస్త్రి, మండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ దాడుల్లో భారీగా జరిమానాలు



కృత్తివెన్ను: విద్యుత్‌శాఖ ఆధ్వర్యాన సోమవారం మండలంలో జరిగిన విజిలెన్స్ దాడుల్లో రూ. 7,97, 288 జరిమానాలుగా విధించినట్లు ఆ శాఖ విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు తెలిపారు. మండలంలోని 2006 గృహసర్వీసులు, 148 వాణిజ్య సర్వీసులు, 163 ఆక్వా సర్వీసులు తనిఖీ చేయగా వాటిలో 187 సర్వీసులకు గాను అధికంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి అపరాధ రుసుం విధించామన్నారు. విద్యుత్ చౌర్యం జరిగినట్లు తెలిస్తే 9440812091, 9440812362, 9440812363 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో మచిలీపట్నం ఈఈ గోవిందరావు, పెడన డీఈఈ మాణిక్యాలరావు, కృత్తివెన్ను ఏఈఈ లక్ష్మీరాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లైవ్ స్టాక్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రసాదరావు

బంటుమిల్లి: స్థానిక పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న లైవ్ స్టాక్ అసిస్టెంట్ వైవీవీ ప్రసాదరావు రాష్ట్ర లైవ్ స్టాక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 10వ తేదీన విజయవాడలో రాష్ట్ర అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో ప్రసాదరావును అసోసియేషన్ సభ్యులు ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

6 వ్యవసాయ సహకార సంఘాలకు చైర్మన్లు

మోపిదేవి: మండలంలోని 10 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రభుత్వం 6 సంఘాలకు త్రిసభ్య కమిటీ కింద సొసైటీ చైర్మన్, పర్సన్స్‌ను సోమవారం ప్రకటించింది. మోపిదేవి పీఏసీఎస్ చైర్మన్‌గా పరుచూరి శ్రీనివాసరావు, పెదప్రోలు సొసైటీ చైర్మన్ నాదెళ్ల శరత్ శ్చంద్రబాబు, కోసూరువారిపాలెం సొసైటీకి చైర్మన్‌గా కోసూరు నాగమల్లేశ్వరావు, మెరకనపల్లికి యర్రంశెట్టి సుబ్బారావు, నాగాయితిప్పరే చైర్మన్‌గా బల్లా సీతారామప్రసాద్, కె. కొత్తపాలెం సొసైటీకి పూషడపు రత్నగోపాల్, అడపావారిపాలెం సొసైటీకి చైర్మన్‌గా అడపా లతాశ్రీ పేర్ల ప్రకటించారు. పెదకళ్లేపల్లి, మేళ్లమర్తిలంక, కొక్కిలిగడ్డ సొసైటీలకు త్రిసభ్య కమిటీలను ప్రకటించలేదు.

మండలి విగ్రహం వద్ద ఏడాది పాటు శత జయంతి

నాగాయలంక: కాంగ్రెస్ యోధుడు దివంగత మాజీమంత్రి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కార్యక్రమాలను నాగాయలంకలో ఏడాది పాటు నిర్వహిస్తామని స్థానిక మండలి శత జయంతి వేడుకల కమిటి ప్రకటించింది. కమిటీ ఆధ్వర్యాన స్థానిక సాయిబాబాగుడి సెంటర్‌లో మండలి విగ్రహానికి సోమవారం 8వరోజు గ్రామ ఉపసర్పంచి తలశిల వెంకట నరసింహారావు(నాని) పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కృష్ణాజిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, భావదేవరపల్లి ఎంపీకే రావు, వికాస సమితి చైర్మన్, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, శివరావు తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



మచిలీపట్నంటౌన్: 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, మెప్మా రిసోర్స్ పర్సన్‌లు, నగరపాలక సంస్థ కార్యాలయ సిబ్బంది సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ చేశారు. కార్యక్రమాన్ని అసిస్టెంట్ కమిషనర్ కేవీ గోపాలరావు ప్రారంభించగా, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్లు రాము, ఆనంద్, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

స్వరూప్‌కు పేర్ని కిట్టు నివాళి

మచిలీపట్నంటౌన్: నగరంలోని రెవెన్యూ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కందిగట్ల స్వరూప్ (60) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన గృహం వద్ద స్వరూప్ మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సోమవారం సందర్శించి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో 45వ డివిజన్ ఇన్‌చార్జ్ ఆకుల శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ) తదితరులు ఉన్నారు.

'స్వచ్ఛ' ఆశయానికి తూట్లు

కోడూరు: స్వచ్ఛభారత్ నిధులు లక్షలాది రూపాయలతో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. కోడూరు ఇండోర్ స్టేడియం సమీపంలో సుమారు రెండేళ్ల క్రితం రూ.3 లక్షల స్వచ్ఛ భారత్ నిధులతో మరుగుదొడ్లను ప్రభుత్వం నిర్మించింది. ఇండోర్ స్టేడియం సమీపంలోనే తహసీల్దార్, మండల పరిషత్, విద్యుత్, ఎమ్మార్సీ కార్యాలయాలు ఉండటంతో ఈ మరుగుదొడ్లను నిర్మించారు. ప్రభుత్వం కార్యాలయాలకు వివిధ అవసరాలపై వచ్చే ప్రజలు వినియోగించుకొనేందుకు వీలుగా నిర్మించారు. అయితే ఇవి ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. మరుగుదొడ్లకు ఎప్పుడు తాళాలే వేసి ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరుగుదొడ్ల పైకి కప్పుతో పాటు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి ఆ ప్రాంతం సర్పాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరుగుదొడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.